క్లుప్తంగా

ఇఫ్తార్ విందులో పాల్గొన్న హనిమిరెడ్డి



జే.పంగులూరు: కులమతాలకు ప్రతీకగా ఇఫ్తార్ విందులు నిలుస్తాయని అద్దంకి వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి పానెం చిన హనిమిరెడ్డి అన్నారు. మండలంలోని రామకూరు గ్రామంలో షేక్ మస్తాన్, షేక్ రెహమాన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. ముందుగా మసీదులో ప్రార్థనలు చేశారు. అనంతరం విందులో భాగంగా ముస్లింలకు భోజనం వడ్డించారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

కారంచేడు: తాళం వేసిన ఇంట్లో దొంగలు చేతివాటం ప్రదర్శించారు. ఈ సఘటన శనివారం మండలంలోని తిమిడెదపాడు గ్రామంలో జరిగింది. బాధితుడు వివరాల మేరకు.. గ్రామానికి చెందిన కే రవీంద్ర దంపతులు ఇద్దరు ఇంటికి తాళం వేసి పొలానికి వెళ్లారు. మధ్యాహ్నం ఇంటికి భోజనానికి పిల్లలు వస్తారని తాళం చెవిని ఎప్పటిలాగనే కిటికీలో పెట్టి వెళ్లారు. ఇంట్లోని బీరువాలో రూ.40 వేల నగదు, సుమారు 15 సవర్ల బంగారు ఆభరణాలు ఉన్నాయి. ఎప్పటి మాదిరిగానే పొలానికి వెళ్లి వచ్చిన రవీంద్ర దంపతులు బీరువా తలుపు ఒకటి తెరచి ఉండటాన్ని గమనించారు. వెంటనే విషయాన్ని పోలీసులకు సమాచారం అందించారు. అయితే బీరువాలో వెతకగా రూ.40 వేల నగదుతో పాటు, సుమారు అర సవర బంగారు ఉంగరం ఒకటి కనిపించలేదని, మిగిలిన బంగారు ఆభరణాలు పక్కన పడేసి ఉన్నాయన్నారు. ఎవరో తెలిసిన వ్యక్తులు చేసి ఉంటారని అనుమానం వ్యక్తం చేశారు. పోలీసులు ఘటనా స్థలానికి వచ్చి పరిశీలించారు.

బాలికా విద్యకు అసిస్ట్ ప్రోత్సాహం

బల్లికురవ: బాలికా విద్యను ప్రోత్సహించేందుకు ప్రభుత్వానికి చేయూత నిస్తున్నట్లు అసిస్ట్ స్వచ్ఛంద సేవా సంస్థ అసోషియేట్ డైరక్టర్ సాస్తి విష్ణుప్రియ పేర్కొన్నారు. శనివారం బల్లికురవలోని ఉన్నత పాఠశాలలో 8,9 తరగతులు చదువుతున్న 16 మంది బాలికలకు సైకిళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ కోఆర్డినేటర్ దుర్గారాణి, హెచ్ఎం హనుమంతరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వాలీబాల్‌లో సెయింట్ ఆన్స్ క్రీడాకారుల ప్రతిభ

వేటపాలెం: జాతీయ స్థాయిలో నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ విద్యార్థులు ప్రతిభ కనర్చి విజేతగా నిలిచారని కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ ఎస్ లక్ష్మణరావు శనివారం తెలిపారు. నరసరావు పేట జేఎన్‌టీయూకూ యూనిర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ నిర్వహించిన ఎంతః ఎక్సెల్–2024 (నేషనల్ యూత్ ఫెస్టివల్) సందర్భంగా జాతీయ స్థాయిలో వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఫైనల్‌లో గుంటూరు కళాశాల జట్టును ఓడించి సెయింట్ ఆన్స్ జట్టు విన్నర్స్‌గా నిలిచారని వ్యాయామ ఉపాధ్యాయుడు అన్నం శ్రీనివాసరావు తెలిపారు. క్రీడాకారులను ప్రిన్సిపాల్ కే జగదీష్‌బాబు, మేనేజర్ ఆర్వీ రమణమూర్తి, అభినందించారు.

యువకుడికి గాయాలు

మార్టూరు: జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. హైవే అంబులెన్స్ సిబ్బంది వివరాల మేరకు.. సుఖదేవ్ అనే యువకుడు తోపుడు బండిపై స్వీట్లు విక్రయిస్తూ గ్రామాల్లో సంచరిస్తుంటాడు. ఈక్రమంలో సుఖదేవ్ శనివారం సాయంత్రం తన మొబైల్ స్వీట్ బండిని తోసుకుంటూ కోనంకి నుంచి ఇసుకదర్శి వైపు జాతీయ రహదారిపై వెళ్తున్నాడు. అదే మార్గంలో మేదరమెట్ల నుంచి చిలకలూరిపేట వైపు వెళ్తున్న ఆటో డ్రైవర్ వెనుక నుంచి సుఖదేవ్‌ను ఆటోతో అతివేగంగా ఢీకొట్టాడు. తీవ్ర గాయాలపాలై అపస్మారక స్థితిలో చేరుకున్న సుఖదేవ్‌ను హైవే అంబులెన్స్ సిబ్బంది ఒంగోలు కిమ్స్ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు

మహిళలకే అగ్రపీఠం

- వైఎస్సార్ చేయూత, ఆసరా పథకాలతో జీవనోపాధి
- సీఎం జగన్ పాలనలో మహిళలకు ప్రాధాన్యం
- మహిళల పేరునే ఇంటి స్థలాలు, సంక్షేమ పథకాలు



ప్రింటింగ్ ప్రెస్ నడుపుతున్న మహిళ (ఫైల్)



ఇది కదా.. అభివృద్ధి

చీరాల: ఆకాశంలో సగం.. అవనిలో సగం. ఇలా ఒకప్పుడు వినపడే నినాదం. మహిళా దినోత్సవం రోజునే మహిళా సంక్షేమం అందరికి గుర్తుకు వస్తుంది. అయితే సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన తర్వాత మహిళలను అగ్ర పీఠాన నిలబెట్టారు. రాజకీయంగా, ఆర్థికంగా సమాజంలో గౌరవప్రదమైన స్థాయి లభించింది. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల లబ్ధిని మహిళల ఖాతాలో ప్రభుత్వం జమ చేస్తుంది. కుటుంబ ఆర్థిక వ్యవహారాలను మహిళలే ఆర్థికంగా నిర్వహిస్తారనే ఆర్థిక నిపుణులు చెప్పిన మాటలకు అనుగుణంగా ప్రభుత్వ పథకాల లబ్ధిని నేరుగా వారి ఖాతాలకు జమ చేస్తోంది. అమ్మఒడి, జగనన్న వసతి దీవెన, జగనన్న విద్యా దీవెన, విదేశీ విద్యా దీవెన, వైఎస్సార్ సున్నా వడ్డీ రాయితీ, వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా వంటి సంక్షేమ పథకాలను లబ్ధిని నేరుగా మహిళల ఖాతాల్లో వేస్తోంది. అలానే ఇళ్ళ స్థలాలు, టిడ్కో ఇళ్లు, చివరకు రేషన్ కార్డులు సైతం ఇంటికి అసలైన యజమాని మహిళల పేరు మీదనే వస్తున్నాయి. ఇటీవల ప్రభుత్వం పంపిణీ చేసిన పట్టాల భూమిని మహిళలకు రిజిస్ట్రేషన్ చేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తమకు సంక్షేమ పథకాలలోనే కాకుండా నామినేటెడ్ పదవుల్లో సగం వారికి ఇస్తున్నారని మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గంలో వైఎస్సార్ చేయూత ద్వారా 15755 లబ్ధిదారులకుగాను రూ.54.39 కోట్లు, ఆసరా ద్వారా 24070 లబ్ధిదారులకు గాను 43.87 కోట్లు, సున్నావడ్డీ ద్వారా 17101 లబ్ధిదారులకు గాను రూ.5.88 కోట్లు మహిళల ఖాతాల్లో జమయ్యాయి.

వ్యాపారానికి చేయూత..



పిండిమర మిషన్ ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నాను. వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా నాలుగు విడతలుగా రూ.54,800 లబ్ధి చేకూరింది. ఆసరా రుణంతో పిండిమర ఏర్పాటు చేసుకుని జీవనోపాధిని పొందుతున్నాను. సీఎం జగన్ మోహన్‌రెడ్డి మేలు మర్చిపోలేం.

– దివ్వెల పద్మావతి, చీరాల

కుటుంబానికి ఆసరా మేలు చేసింది..



నేను వీరరాఘవ పొదుపు గ్రూపు సభ్యురాలిని. మా సంఘానికి వైఎస్సార్ ఆసరా పథకం కింద నాలుగు విడతలుగా రూ.28 వేలు లబ్ధి చేకూరింది. సకాలంలో రుణం ఇవ్వడం, దానిపై వడ్డీ రాయితీ అందించడం వలన ప్రింటింగ్ ప్రెస్ నడుపుకోవడానికి జీవనోపాధిని మెరుగుపరచుకోవడానికి ఆసరా రుణం ఎంతో ఉపయోగపడింది.

– అచ్చుల వసుంధర, పాపరాజుతోట, చీరాల

రుణంపై సున్నా వడ్డీ..



సీతారామ పొదుపు గ్రూపు సభ్యురాలిని. వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం క్రింద రూ.5,800 లబ్ధి చేకూరింది. లబ్ధి పొందిన సున్నా వడ్డీతో టిఫిన్ బండి నడుపుకుంటూ జీవనోపాధిని పెంపొందించుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాను. సీఎం జగనన్నకు రుణపడి ఉంటాం.

– తగలమూడి లక్ష్మి, చీరాల

సున్నా వడ్డీ ఆదుకుంది



సీతారామ పొదుపు గ్రూపు సభ్యురాలిని. వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం క్రింద రూ.6,400 లబ్ధి చేకూరింది. లబ్ధి పొందిన సున్నా వడ్డీతో టైలరింగ్ చేస్తూ జీవనోపాధిని పెంపొందించుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాను. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అందరికి ఎంతో మేలు జరిగింది.

– కటారి లక్ష్మి, చీరాల

నేడు గాంధీనగర్‌లో వెంకటేష్ ప్రచారం

చీరాల టౌన్: వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి కరణం వెంకటేష్ ఆదివారం మండలంలోని గాంధీ నగర్ గ్రామ పంచాయితీలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తున్నారని పార్టీ కార్యాలయం శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్ సీపీ వివిధ హోదాల్లోని నాయకులు, కార్యకర్తలు, బూత్ కన్వీనర్లు, గృహ సారథులు, అందరు విధిగా హాజరు కావాలని పార్టీ నాయకులు సూచించారు.

అగ్నికి ఆహుతైన జామాయిల్ తోట



దగ్ధమవుతున్న జామాయిల్ తోట

అద్దంకి రూరల్: మండలంలోని చక్రాయపాలెం గ్రామంలోని పొలాల్లో జామాయిల్ తోట అగ్నికి ఆహుతైన ఘటన శనివారం చోటుచేసుకుంది. అందిన వివరాల మేరకు.. మండలంలోని చక్రాయపాలెం గ్రామానికి చెందిన పల్లా నాగేశ్వరరావు చెందిన 15 ఎకరాల జామాయిల్ తోటలో నుంచి మంటలు చెలరేగాయి. గమనించిన రైతులు మంటలు పక్కపొలాలకు వ్యాపించకుండా నీళ్లు చల్లుతూ ఫైరింజన్‌కు సమాచారం అందించారు. పక్క పొలంలోని సర్పంచ్ గోగులమూడి నగేష్ పొలంలోని మొక్కజొన్న పంటకు మంటలు వ్యాపించి కొంతమేర కాలిపోయింది. ఫైరింజన్ వచ్చి మంటలను అదుపులోకి తెచ్చారు. ఆకతాయిలు సిగరెట్ తాగి పీకలను విసరడంతో మంటలు వచ్చి ఉంటాయని భావిస్తున్నారు.

వెంకటేష్ విజయానికి కృషిచేయాలి

- ఎమ్మెల్యే బలరాం సమక్షంలో మద్దతు ప్రకటించిన వాడరేవు ప్రజలు



ఎమ్మెల్యే కరణం బలరాంతో వాడరేవుకు చెందిన మత్స్యకారులు

చీరాల: మత్స్యకారుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యతనిచ్చిన సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి అండగా నిలవాల్సిన సమయం వచ్చింది.. వైఎస్సార్‌సీపీ అభ్యర్థి కరణం వెంకటేష్‌ను ఎమ్మెల్యేగా గెలిపించడంతో పాటుగా సీఎంగా మళ్లీ జగన్ మోహన్‌రెడ్డిని చేయాలని ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి సూచించారు. శనివారం మండలంలోని వాడరేవు గ్రామానికి చెందిన 40 మత్స్యకార కుటుంబాలు ఎమ్మెల్యే కరణం బలరాంను కలిసి వైఎస్సార్ సీపీకి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో తామంతా పార్టీకి అండగా నిలవడంతో పాటుగా చీరాల ఎమ్మెల్యేగా వెంకటేష్‌ను గెలిపించుకుంటామన్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే బలరాం మాట్లాడుతూ ప్రాణాలు పణంగా పెట్టి సముద్రంలో జీవన పోరాటాలు చేసే గంగపుత్రులను గత పాలకులు విస్మరించారన్నారు. ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచే మత్స్యకారులకు వేట విరామంలో ఒక్కో కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సాయం అందించి ఆదుకున్న వైఎస్సార్ సీపీకి అందరూ అండగా నిలవాలని సూచించారు. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న గంగపుత్రుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చేసి నియోజకవర్గాన్ని అన్నీ విధాలుగా అభివృద్ధి చేయడంతో పాటుగా టూరిజంలో సముద్ర తీర ప్రాంతాలను వృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించామన్నారు. వెంకటేష్‌ను చీరాల ఎమ్మెల్యేగా, సీఎంగా మళ్లీ జగన్ మోహన్‌రెడ్డికి గెలిపించుకునే కృతజ్ఞత చెప్పే సమయం వచ్చిందని పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు అందరూ ఫ్యాన్ గుర్తుపై ఓట్లేసి గెలిపించాలన్నారు. వాడరేవు గ్రామంలో పార్టీని బలోపేతం చేసి స్టార్ క్యాంపెయినర్లుగా ప్రచారాన్ని చేసి వెంకటేష్‌కు మంచి మెజార్టీ తీసుకురావాలని ఎమ్మెల్యే వాడరేవు నాయకులకు సూచించారు. కార్యక్రమంలో ఎరిపిల్లి రాము, గరికిన రాజు, ఓసుపల్లి రమణ, చప్పం యేసు, ఓసిపిల్లి తాతయ్య, పి.సత్యారావు, బబ్లూ, రాజారావు, మరళీ తదితరులు ఉన్నారు.

ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలి



ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న అభ్యర్థి యడం బాలాజీ

- నియోజకవర్గ అభ్యర్థి యడం బాలాజీ

పర్చూరు (చినగంజాం): రాష్ట్రంలో అవినీతికి తావు లేని పారదర్శకమైన పాలన తీసుకురావాలంటే రాబోయే ఎన్నికలలో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్ సీపీని గెలిపించాలని పర్చూరు నియోజక వర్గ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి యడం బాలాజీ అన్నారు. శనివారం మండలంలోని ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొని పలువురు ఓటర్లతో ఆయన స్వయంగా కలిసి మాట్లాడారు. ప్రచారంలో తనదైన శైలిలో ముందుకు దూసుకుపోతున్నారు. ఓటర్లను ఆకట్టుకునేందుకు ఆయన ఇంటింటికి తిరిగి ప్రచారం నిర్వహించారు. ఆయన మండలంలో నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు ఘన స్వాగతం పలికారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల వలన కలిగిన ప్రయోజనాలను గురించి ఆయన వివరించారు. ప్రతి ఇంటికి వెళ్లి మరోసారి జగన్ మోహనరెడ్డిని గెలిపించాలని కోరారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వస్తే రాష్ట్రంలో సంక్షేమ పథకాలు రెట్టింపు అవుతాయని తెలిపారు. మాయ మాటలను నమ్మి మోసపోవద్దని ఆయన ప్రజలను కోరారు. కార్యక్రమంలో నాయకులు కోట హరిప్రసాద్, నరిశెట్టి విపిన్‌బాబు, కొనకంచి వెంకటరత్నం, కోలా శ్రీనివాసరావు, బిరుగు నాగేంద్రం, గాజుల రమేష్, కట్టారత్న రాజు, కూరాకుల ఇస్సాక్, కే బాబురావు, ఆకుల హేమంత్, దాసి నరసింహారావు, కోట ప్రభుదాసు తదితరులు పాల్గొన్నారు.

రాబోయే ఎన్నికల్లో గెలిచేది వైఎస్సార్ సీపీనే



ప్రజలకు అభివాదం తెలుపుతున్న కరణం వెంకటేష్



కరణం వెంకటేష్‌కు స్వాగతం పలుకుతున్న ప్రజలు

- దేవినూతలలో కరణం వెంకటేష్‌కు బ్రహ్మారథం
- ఎన్నికల శంఖారావాన్ని పూరించిన ఎమ్మెల్యే అభ్యర్థి వెంకటేష్

చీరాల: రాబోయే ఎన్నికల్లో నియోజకవర్గంలో, రాష్ట్రంలో గెలిచేది వైఎస్సార్ సీపీనే అని అసెంబ్లీ అభ్యర్థి కరణం వెంకటేష్ పేర్కొన్నారు. శనివారం రాత్రి మండలంలోని దేవినూతల పంచాయతీలోని పోలేరమ్మ గుడి దగ్గర నుంచి వెంకటేష్ ఎన్నికల ప్రచారాన్ని మొదలుపెట్టారు. ఇంటింటికి వెళ్లి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రాష్ట్రంలో అధికారం చేపట్టిన తర్వాత చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాలు, కార్యక్రమాలపై ప్రజలకు వివరించారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్రంలో సాగిస్తున్న ప్రజాసంక్షేమ పాలనను వివరిస్తూ ప్రచార కార్యక్రమాన్ని కొనసాగించారు. రాష్ట్రంలో సీఎం జగన్ పార్టీలకు, కుల మతాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా తీసుకుని ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో సంక్షేమ పథకాలు అందని గడప లేదన్నారు. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలతో ప్రతి ఒక్కరూ లబ్ధి పొందారన్నారు. ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా చూసిన వ్యక్తి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని, వారి సమస్యలకు పరిష్కార మార్గంగా రాష్ట్రంలో నవరత్నాల పథకాలను అమలు చేశారన్నారు.

ఓర్వలేని ప్రతిపక్షాలు..

ఐదేళ్లుగా వృద్ధులకు, వితంతువులకు, వికలాంగులకు పెన్షన్లును ప్రతి నెల ఒకటవ తేదీ ఉదయాన్నే వలంటీర్ల ద్వారా అందిస్తున్నారన్నారు. ప్రజా ప్రభుత్వమైన వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి ప్రజలలో వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నాలు చేస్తుందన్నారు. ప్రజలందరూ రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలను గమనిస్తూనే ఉన్నారన్నారు. రానున్న ఎన్నికలో ప్రజా ప్రభుత్వమైన వైఎస్సార్‌సీపీకి పట్టంగట్టి జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంను చేసుకోవాలన్నారు. నాయకులు, కార్యకర్తలు పార్టీ గెలుపు కోసం నిరంతరం కృషి చేయాలని కోరారు. ఫ్యాన్ గుర్తుకు ఓటువేసి తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని, వైఎస్సార్ సీపీ జెండా చీరాల నియోజకవర్గంలో ఎగురవేయాలన్నారు. అలానే బాపట్ల పార్లమెంట్ అభ్యర్థి నందిగం సురేష్‌ను గెలిపించాలన్నారు. గ్రామంలో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, వాటి అమలు తీరును వివరిస్తూ ఓటును అభ్యర్థించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వి.పద్మావతి, మల్లవరపు ఏడుకొండలు, వాకా శివ, వి.రమేష్, మాజీ సర్పంచ్ సురేష్, దుర్గారావు, పార్టీ రూరల్ అధ్యక్షులు ఆసాది అంకాలరెడ్డి, మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, వేటపాలెం, చీరాల మండలాల నాయకులు, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణ

చీరాల అర్బన్: ప్రశాంత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికలు నిర్వహించేందుకు అందరూ కృషిచేయాలని చీరాల ఒన్‌టౌన్ సీఐ శేషగిరిరావు అన్నారు. చీరాల డీఎస్పీ బేతపూడి ప్రసాద్ ఆధ్వర్యంలో శనివారం బీఎస్ఎఫ్ సిబ్బందితో ఒన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో సమస్యాత్మక ప్రాంతాల్లో రూట్ మార్చ్ నిర్వహించారు. అలానే వాహనాలను తనిఖీ చేశారు. అలానే ఆ ప్రాంత పరిధిలోని రౌడీషీటర్లకు వారి ఇంటి వద్దనే కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా కృషి చేయాలన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారి సమాచారాన్ని పోలీసు అధికారులకు తెలియజేయాలన్నారు. అసాంఘిక కార్యాకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

ఇఫ్తార్ విందు పుణ్యకార్యం

- కొత్తపేటలో ఇఫ్తార్ విందులో పాల్గొన్న వెంకటేష్



కరణం వెంకటేష్‌కు స్వాగతం పలుకుతున్న ముస్లిం పెద్దలు

వేటపాలెం/చీరాల రూరల్: పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాసాలు పాటించే ముస్లింలకు ఉపవాసాలు విడిచే సమయంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయడం పుణ్యకార్యం అని చీరాల వైఎస్సార్ సీపీ అభ్యర్థి కరణం వెంకటేష్ తెలిపారు. వేటపాలెం మండలం కొత్తపేట ముస్లింలు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు కార్యక్రమంలో కరణం వెంకటేష్ శనివారం పాల్గొన్నారు. రంజాన్ అందరిలో సంతోషం నింపాలని ఆకాంక్షించారు. ముస్లింలతో కలసి వెంకటేష్ ప్రార్థనలు చేశారు. మత సామరస్యానికి ప్రతీకగా ఇస్లాం వెల్లివిరుస్తుందని, ముస్లింలు ప్రతి ఒక్కరినీ అన్నదమ్ములుగా భావించి కలసిమెలసి జీవిస్తారని వెంకటేష్ అన్నారు. ముస్లింలకు మేలు చేసింది ఒక్క సీఎం జగన్ మోహన్‌రెడ్డినే అని పేర్కొన్నారు. ముస్లింల కోసం ఎన్నో పథకాలు ప్రవేశ పెట్టి వారి అభ్యున్నతికి పాటుపడ్డారని తెలిపారు. ముస్లింలు పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో షేక్ కబీర్, షేక్ సుభాని, షేక్ ఇలియాస్, వాహబ్, సలామ్, షేక్ మీజ్బావలి, చాంద్ బాషా, సయాద్ సులేమాన్, మహమ్మద్, షేక్ మౌలాలి పాల్గొన్నారు.

మూకుమ్మడిగా వలంటీర్ల రాజీనామా



హనిమిరెడ్డితో రాజీనామా చేసిన వలంటీర్లు

మార్టూరు: రాష్ట్ర ప్రజలకు గడచిన ఐదేళ్లలో జగనన్న చేసిన సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను తిరిగి రాష్ట్రంలో తెచ్చుకునేందుకు మేమంతా సిద్ధం అంటూ వలంటీర్లు పలువురు రాజీనామాలు చేశారు. మార్టూరు మండలంలోని వలపర్ల గ్రామ సచివాలయ వలంటీర్‌లు శనివారం తమ రాజీనామాలను ఎంపీడీవో జీ నితిన్‌కు అందజేశారు. మళ్లీ రాష్ట్ర ముఖ్యమంత్రిగా జగన్ మోహన్‌రెడ్డిని, పర్చూరు ఎమ్మెల్యేగా యడం బాలాజీ గెలుపించుకునేందుకు మేమంతా సిద్ధం అంటూ వారు తమ రాజీనామాలను అందజేశారు. తాము రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను నిరుపేద ప్రజలకు వారి ఇంటి వద్దకే అందిస్తున్నామని, ఈ రోజు తెలుగుదేశం పార్టీ అడ్డుకుంటున్న దృష్ట్యా తామంతా జగనన్నకు అండగా ఉండేందుకు, ప్రభుత్వ సంక్షేమ పథకాలను వలపర్ల గ్రామ ప్రజలకు వివరించేందుకు మేము రాజీనామాలు చేస్తున్నామంటూ వారు తెలిపారు. దాంతో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆర్యవైశ్యులను కించపరుస్తూ కిరణా షాపులలో గంజాయి పెట్టి అమ్ముతున్నారంటూ దూషించడం ఆయన పట్ల మరింత వ్యతిరేక భావన కలుగుతుందని వారన్నారు. రాజీనామాను సమర్పించిన వారిలో వలంటీర్‌లు తవ్వా లక్ష్మి, చేబ్రోలు శివకృష్ణ, కనమర్లపూడి శ్రీలత, వాగిచర్ల వసంత తదితరులు ఉన్నారు.

వేటపాలెంలో ఐదుగురు వలంటీర్ల రాజీనామా..

వేటపాలెం: మండల పరిధిలోని పుల్లరిపాలెం పంచాయతీ కొత్తరెడ్డిపాలేనికి చెందిన ఐదుగురు వలంటీర్లు రాజీనామా చేశారు. శనివారం తమ రాజీనామా పత్రాలను ఎంపీడీఓ రూతమ్మకి అందజేశారు. మాకు ఇన్ని సంవత్సరాలు అండగా ఉన్న వైఎస్సార్ సీపీ గెలుపు కోసం తమ వంతు కృషిచేస్తామని పేర్కొన్నారు.

జే.పంగులూరు: మండల పరిధిలోని అరికట్లవారిపాలెం, రామకూరు, చందలూరు గ్రామానికి చెందిన వలంటీర్లు రాజీనామాలు చేశారు. ఈ మేరకు శనివారం ఎంపీడీవో మాధ్యూబాబుకి తన రాజీనామా పత్రాలు అందించారు. ఆరికట్లవారిపాలెంలో జే సంధ్య, కె ప్రభుదాసు, జి శిరిష, యు రాణి, జి ప్రభుదాసులు, చందలూరులో గోపి, గౌతం, అభిషిత్, లక్ష్మయ్య, రామకూరు గ్రామానికి చెందిన 15 మంది వలంటీర్లు షేక్ కరీష్మ, మొగల్ కరీమున్, షేక్ నాగుర్‌వలి, షేక్ మహ్మంద్, షేక్ జముల్, కలిగిరి హరికృష్ణ, కొల్లూరి బుల్లిబాబు, తాల్లూరి గోపి, దొడ్డక రమాదేవి, దొడ్డక శివనాగలక్ష్మి, కురిచేటి తిరుపతమ్మ, పాలపర్తి వేణుబాబు, షేక్ నజీర్, గుంజి పద్మ, చింతకాయల పద్మినిలు రాజీనామా చేశారు.

అద్దంకి రూరల్: మండలంలోని ధేనువుకొండ గ్రామానికి చెందిన 17 మంది వలంటీర్లు తమపదవులకు రాజీనామ చేశారు. అనంతరం స్థానిక పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అసెంబ్లీ అభ్యర్థి పానెం చిన హనిమిరెడ్డి ని మర్యాద పూర్వకంగా కలిసి సంఘీభావాన్ని తెలిపారు. పార్టీ గెలుపుకోసం కలిసి కట్టుగా పనిచేయాలన్నారు. ఈకార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు. జే పంగులూరు మండలం బూదవాడలో నలుగురు వలంటీర్లు సుబ్బారెడ్డి, గోపి, విజయ్‌కుమార్, నాగార్జున రాజీనామా చేశారు.



రాజీనామాలు చేసిన రామకూరు వలంటీర్లు



వేటపాలెంలో రాజీనామా పత్రాలను ఎంపీడీవో రూతమ్మకి అందజేస్తున్న వలంటీర్లు



మార్టూరులో ఎంపీడీవో నితిన్‌కు రాజీనామాలు సమర్పిస్తున్న వలంటీర్లు